

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

### అమ్మాయి కాపురం

పొద్దున్నే కాఫీల వేళకే వీరయ్య బండిలో దిగుతున్న సుశీలనీ, వాళ్ళ అత్తగారు అరుంధతినీ చూసి వీధి గుమ్మాలు కడుగుతున్న వరాలు కేక వేసింది.

'అమ్మగారండీ, అమ్మాయిగారు, ఆరి అత్తయ్యగారూ వచ్చారు, బేగే రండీ ' అంటూ.

ఒక్క క్షణం తను విన్నది నిజమేనా అని అనుమానం వేసింది భ్రమరాంబకి. భర్త రాఘవరావుతో కలిసి వీధి వాకిలి దగ్గరకి నడిచింది. నిజమే, ఇద్దరూ చెరో పెట్టే పట్టుకుని అత్తా, కోడళ్ళు దిగిన మాట. ముఖం పీక్కుపోయి, తోటకూర కాడలా వడిలిపోయినట్టున్న కూతుర్నీ, వెనకే వస్తున్న అత్తగారు అరుంధతినీ చూడగానే ఆవిడ మనసెందుకో కీడు శంకించింది. ఎందుకంటే - ఆకాశమంత పందిరీ, భూదేవంత అరుగూ వేసి పిల్ల పెళ్ళి చేసి అత్తవారింటికి పంపి రెండునెలలవుతోందేమో, ఉగాది పండక్కి పిలుద్దాం అనుకునే లోపునే ఈ అర్థాంతరపు రాకకి కారణం ఏమిటో ఆవిడకి అర్థం కాలేదు.

'బావున్నారా వదినా? ' అరుంధతే అడిగింది.

' రామ్మా! రా, ప్రయాణం బాగా జరిగిందా? మా బావగారూ, అల్లుడుగారూ బావున్నారా? ఒక్క ముక్క చెప్పుంటే రాజమండ్రీ వచ్చే వాళ్ళం కదా! ' అరుంధతిని అడుగుతూనే 'అలా గుడ్లప్పగించి చూస్తావేమిటి భ్రమరం! లోపలకి తీసుకెళ్ళు' అన్నాడు రాఘవరావు.

కొద్దిగా తేరుకుని 'రండి వదినా, రామ్మా సుశీ ' అని లోపలకి నడిచింది భ్రమరాంబ.

స్నానపానాలు అయ్యాకా అరుంధతే అంది. ‘ ఆయనా, వాడూ వ్యాపారం పనిమీద నాగపూర్ వెళ్ళారు, అందుకే నేను సుశీలని తీసుకుని ఇలా వచ్చాను నాకూ స్కూల్ నాలుగురోజులు సెలవలు కదా‘ అని.

'అదేవిటమ్మా? మీరు ఎందుకొచ్చారో మాకు కారణం చెప్పాలా, ఇది మీ అన్నయ్య ఇల్లనుకో, ఎప్పుడైనా రావచ్చు' అన్నాడు రాఘవరావు, కొబ్బరిబొండం కొట్టిస్తూ.

చిన్నగా నవ్వింది అరుంధతి. అరుంధతి, ప్రసాదరావు దంపతులు బొంబాయిలో ఉంటారు. ప్రసాదరావు పూర్వీకులు పక్క అగ్రహారానికి చెందినా వారైనా, ఎప్పుడో అతని తండ్రి బొంబాయి వెళ్ళి బట్టల వ్యాపారం లో స్థిరపడిపోయాడు. ప్రసాదరావుకి ముగ్గురు పిల్లలు, పెద్దవాడు సురేష్ తండ్రి వ్యాపారంలో సహాయం చేస్తాడు, చిన్నవాడు రమేష్ ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు. పిల్ల అందరికంటే చిన్నది కాలేజీలో ఉంది.

కిందటేడు రాజమండ్రీ లో బంధువుల ఇంటికి పెళ్ళికి వచ్చినప్పుడు వాళ్ళు సుశీలని చూడటం, చాలా ఇష్టపడి సురేష్‌కి చేసుకుంటామని కబురు పెట్టడం జరిగింది. ముద్దబంతిపువ్వులా తమ చాటున పెరిగిన పిల్ల, అంత దూరం ఎలా పంపడం అని చాలా అలోచించారు భ్రమరాంబ, రాఘవరావు. కుటుంబం చాలా మంచిది, పిల్లవాడు బంగారం, పెద్ద చదువు, సొంత వ్యాపారం అది, అని అందరూ చెప్పడంతో దాదాపు మూడు నెలల క్రితమే ఘనంగా పెళ్ళి చేసారు. సుశీల చక్కటి పిల్ల, నెమ్మదైనది, తన పనేదో, తన లోకమేదో అన్నట్టు ఉంటుంది. అమలాపురం కాలేజీలో డిగ్రీ చదువుతుండగానే పెళ్ళి అయింది. ఆవుదూడలన్నా, సన్నజాజి పూలన్నా, విశాలమైన వాకిట్లో ముగ్గులేయడమన్నా చాలా ఇష్టం ఆ అమ్మాయికి. మనిషెంత సుకుమారమో, మనసంత సుతిమెత్తన, ఎప్పుడూ ఎవర్నీ ఒక మాట అని ఎరగదు, చివరకి చెల్లెళ్ళని కూడ.

' ఈడూ జోడూ ముచ్చటగా ఉంది' అని ఊరి వాళ్ళు అంటుంటే భ్రమరాంబ మనసు మురిసిపోయింది. ' గుమ్మలోకి వచ్చింది బంగారంలాంటి సంబంధం' అని.

'ఇంతలోకి ఈ ప్రయాణం ఏమిటో! అది కూడా ఆడవాళ్ళిద్దరే రావడం' అని భ్రమరాంబ మనసులో లక్ష సందేహాలు. అరుంధతిని చూస్తే చాలా మాములుగా, పెళ్ళిలో ఉన్నట్లే సరదాగా ఉంది. 'అక్కయ్యా, మన వియ్యపురాలు ఎంత మంచావిడో, ఒక్క దానికి కూడ ఏ వంకా పెట్టడంలేదు పెళ్ళిలో ' అన్న తోడి కొడళ్ళ మాటల్ని నిజంచేస్తూ చక్కగా ఉంది.

'నువ్వు ఆవిడనేమీ అడగకు, తరవాత కనుక్కుందాం', పాల చెంబులు వంటింట్లో పెడుతూ అన్నాడు రాఘవరావు ఆమెతో. అర్ధమైంది అన్నట్టు తల ఊపింది.

చెల్లెళ్ళతో కలిసి తోటలోకి పరిగెడుతున్న సుశీలని ఆపి 'అత్తయ్య దగ్గర కూర్చో, ఇప్పుడే వంటావిడకి ఏం వండాలో చెప్పేసి వస్తా' అంది.

'పరవాలేదు వెళ్ళనివ్వండి. నేను ఇల్లంతా తిరిగి వస్తాను' అంది అరుంధతి.

రోజంతా పిల్లలతో సమానంగా తోటల్లో తిరిగింది సుశీల. చిన్న లేగదూడకి నూతి దగ్గర నీళ్ళు తోడి స్నానం చేయించింది. కూనిరాగాలు తీస్తూ చిన్నవాకిలంత ఉన్న నీళ్ళగదిలో గంటన్నరసేపు నలుగు పెట్టుకుని తలస్నానం చేసింది. తులసి కోట కడిగి చుట్టూ ముగ్గులేసింది. మందారాలూ, నందివర్ధనాలూ పూజకి కోసింది. ముద్దపప్పులో నెయ్యి ఆవకాయ వేసుకుని ఆత్రంగా అన్నం తింది.

సాయంత్రం సుశీల 'సన్నజాజులు కోసుకొస్తాను ' అని వెళ్ళాక అరుంధతిని అడిగింది భ్రమరాంబ. 'ఇలా అడిగానని ఏమీ అనుకోకండి వదినా, ఈ ప్రయాణమేమిటి? అంతా బావుందా? మా సుశీ తెలిసో తెలియకో ఎదైనా తప్పు చేసిందా? నిజం చెప్పండి' అంది.

'అబ్బే! అలాంటిదేమీ లేదు చెప్పానుకదా అనుకోకుండా సెలవు దొరికింది కదా అని సరదాగా నాలుగు రోజులు ఉందామని వచ్చాను, పెళ్ళిలో హడావుడి అయిపోయింది కదా' అంది అరుంధతి.

'ఊరికే నాలుగురోజుల భాగ్యానికి రైలూ, బస్సూ, బండీ ఇన్ని మారి వస్తారా? అదీ ఓ కబురూ కాకరకాయా లేకుండా? 'భ్రమరాంబకి నమ్మబుద్ధి కాలేదు, కానీ చేసేదేమీ లేదు.

రాత్రి తన దగ్గిర పడుక్కుంటాను అని వచ్చిన కూతురిని మెల్లగా మాటల్లో పెట్టింది. 'ఏమ్మా ఎలా ఉన్నావు? అక్కడంతా బావుందా నీకు, ఇలా చిక్కిపోయావేం? ' అని లాలనగా అడిగింది.

'నాకు అక్కడేమీ నచ్చలేదమ్మా, ' చిన్నపిల్లలా తల్లిని అల్లుకుపోతూ అంది సుశీల.

'నచ్చకపోవడం ఏమిటే? అనుమానంగా అడిగింది .

'అంటే వాళ్ళ ఇల్లు ఎంత చిన్నదో తెలుసా, మన వాకిలంత ఉంటుందేమో, దాంట్లోనే మూడు గదులూ, హాలూ, వంటిల్లూ, రెండు స్నానాలగదులూ, పైగా అన్నీ ఇంట్లోనే' అంది. చిరాకుగా.

' సరే పట్నవాసపు ఇళ్ళు, మనలా ఉండవుకదా' తల్లి అంది. మాట్లాడలేదు సుశీల.

'అబ్బాయి నీతో ఎలా ఉంటాడే ? అతనితో ఏదన్నా గొడవ పడ్డావా? ' అంది చిన్నగా. అల్లుడికీ కూతురికీ ఏవైనా మాట తేడా వచ్చిందేమోనన్న అనుమానంతో,

'ఛా, అదేమీ లేదు, ఆయనకి నేనంటే ప్రాణం. ఎప్పుడూ సుశీ అంటూ క్షణం కూడా వదలరు' నైట్ బల్బ్ వెలుగులో సిగ్గుపడ్డ సుశీల ముఖం అందంగా మెరిసింది. 'అందరూ బావుంటారు, నన్నెంతో బాగా చూసుకుంటారు కానీ నాకే అక్కడ నచ్చలేదు. పొద్దున్నే లేస్తూనే అందరూ ఉరుకులూ పరుగులూ, పొద్దున్నే రొట్టెలు చేసుకోవడం, డబ్బాల్లో సర్దుకోవడం పరుగెట్టడం రాత్రికి రావడం, ఎక్కడ కూర్చుని ఒక మాట గట్టిగా మాట్లాడినా సరే ఇంట్లో అంతా వినిపిస్తుంది, మా గదీ, అత్తగారి గదీ పక్కపక్కనే ఒక్క గోడే అడ్డం. నాకేమిటో జైలు లో ఉన్నట్లుందనుకో ' ఇలా చెపుతూ నిద్రపోయింది మధ్యలోనే. విషయం సగం అర్థం అయిన భ్రమరాంబ రాఘువరావుని నిద్రలేంచి లేపి మరీ చెప్పింది.

'కాసేపు చల్లగాలికి చెట్టుకింద కూర్చుందాం వస్తారా?' అని సపోటా చెట్టు కిందకి దారి తీసింది అరుంధతి మర్నాడు సాయంత్రం. తన తోడి కోడళ్ళు అక్కడ ఉండడం వల్ల ఆవిడ విషయం చెప్పట్లేదని అర్థం అయింది భ్రమరాంబకి. పెరట్లో నూతి పళ్ళేనికి పక్కనే ఉన్న సపోటా చెట్టు కింద పడి మీద కూర్చున్నారు ఇద్దరూ.

'మీరెప్పుడూ బొంబాయి రానేలేదు, ఈసారి తప్పకుండా రావాలి' అంది అరుంధతి సంభాషణ ప్రారంభిస్తూ. బదులుగా నవ్వింది భ్రమరాంబ. 'పెద్ద పట్నంట కదా, ఎంతో హడావుడిగా ఉంటుందిట, మీ అన్నయ్యగారు చెప్పారు కిందటి సారి సుశీలని దింపటానికి వచ్చినప్పుడు చూశారు కదా 'చెప్పింది భ్రమరాంబ.

'మరే, అక్కడ బిజీ తప్ప మరో మాటే ఉండదు అందుకే పాపం సుశీల అలవాటు పడలేకపోతోంది' అంది అరుంధతి ఉపోద్ఘాతంగా.

'దాని మొహం, చిన్నపిల్ల దానికేం తెలుసు చెప్పండి!' సర్దబోయింది భ్రమరాంబ.

'అలా అనకండి, తను పుట్టి పెరిగిన ఊరు వేరు, తన ప్రపంచం వేరు, ఇంత ఇంట్లో పెరిగిన ఎవరికైనా మా ఇంట్లో ఉండాలంటే జైలులో ఉన్నట్లుండడంలో వింతేమీ లేదు. మాకు మూడు బెడ్‌రూముల ఇల్లు ఉంది. ఒకటి మాది, రెండోది సుశీల, సురేష్ లది. మూడోది చిన్నపిల్లలది, ఎవరైనా వస్తే ఒకటి వాళ్ళకి ఇవ్వడమో లేకపోతే హాల్లో వాళ్ళని పడుక్కోమనడమో చెయ్యాలి. బొంబాయి లో మా ఇల్లంత ఇల్లు ఉండడం గొప్ప మాకు, సుశీలకి పాపం గట్టిగా మాట్లాడాలన్నా నవ్వాలన్నా ఇబ్బందిగా ఉంటోంది'

' సాంప్రదాయం ప్రకారం పెరిగిన పిల్ల కదా, ఆయన పొద్దున్నే నాకు వంటలో సహాయం చేసినా భోజనాల దగ్గర అన్నీ అమర్చినా, మిషన్‌లో బట్టలు వేసినా తనకి వింతగా ఉంటుంది, మొహమాటపడుతుంది. పెద్ద ముగ్గు పెట్టాలన్నా, పూల మొక్కలు

పెంచాలన్నా వీలు కావడంలేదు తనకి. ఇంకోటి, పొద్దున్నే లేచి మేమందరమూ తలో దిక్కుకూ వెళ్ళిపోతే, కొంత సేపు ఒక్కర్తీ ఉండాలి, పదిమందిలో పెరిగిన పిల్లకి అదీ కష్టమే, భాష రాదు కనక ఇరుగు పొరుగు వాళ్ళతో కలవడం తక్కువ, మాధవి మధ్యాహ్నం వచ్చేస్తుంది, తరవాత నేను వచ్చేస్తాను అనుకోండి. భోజనం కూడ పాపం ఇబ్బందిగానే ఉంది తనకి.

అన్నిటికంటే ముఖ్యంగా ఏకాంతం. వాళ్ళిద్దరికీ కావలసిన ఏకాంతం మా ఇంట్లో దొరకడం లేదేమోనని నా అభిప్రాయం, కొంతకాలం క్రితం 'పియా కా ఘర్' అని ఒక హింది సినిమా వచ్చింది, అందులో కథానాయిక ప్రస్తుతం మన సుశీల లాంటి స్థితిలోనే ఉంటుంది. పెద్ద ఇంట్లో పల్లెటూళ్ళో పెరిగి వచ్చిన పిల్ల సినిమాలో నాయిక, అయితే తన అత్తగారిల్లు మా ఇంటికంటే చిన్నది అనుకోండి, మొత్తమ్మీద ఇలాగే ఉంటుంది విషయమంతా. '

'ఇవేమన్నా పెద్ద విషయాలా వదినా, మనమందరమూ చేసుకోవడంలేదూ సంసారాలూ? ' అన్న భ్రమరాంబ మాటలకి అడ్డు తగులుతూ అంది అరుంధతే,

'అదే సరి కాదని నా భావన. మనకి అవకాశం లేక, సర్దుకుపోయాము, మనం అనుభవించినదే మన పిల్లలూ అనుభవించాలా? ఇక్కడ ఇంత పెద్ద నీళ్ళపొయ్యి, విశాలమైన బాత్రూం అలవాటు, పాపం అక్కడ కొత్తలో స్నానానికి కూడ ఇబ్బంది పడేది . మేము ఎంత బాగా వండినా ఇక్కడి వంటల రుచి రానే రాదు, ఇలా భోజనం దగ్గరనించీ అన్నిటికీ కష్టపడుతుంటే నాకూ, ఆయనకీ ఎలాగో ఉంటుంది. తెలియకుండానే దిగులు పడుతోందేమోనని నా అనుమానం. ఏం చెయ్యాలో తెలీలేదు, పోనీ కొన్నాళ్ళు మీదగ్గర ఉంటే కొద్దిగా దిగులు తగ్గుతుందేమో అని ఆశతో ఈ ప్రయాణం చేయించాను అంది ఆవిడ. తనని దింపి నేను ఎల్లుండి వెళ్ళిపోతాను, పండగ దాకా మీ దగ్గర ఉంచుకుని తరవాత సురేష్ వస్తాడు, అతనితో పంపండి' అంది. 'అలాగే, వచ్చేటప్పుడు వాళ్ళిద్దరినీ కొన్నాళ్ళు ఊటీ అవి చూసి రమ్మన్నాము, మా వ్యాపారమే కదా, వాళ్ళ నాన్న చూసుకుంటారు పరవాలేదు, వచ్చే ఏడాది నేను రిటైర్ అయిపోతాను అప్పుడు నేను ఇంట్లో ఉంటే తనకీ ధైర్యంగా ఉంటుంది, తను చదువుకుంటానంటే అక్కడ ట్యూషన్ పెట్టిస్తాను, ఇక్కడకొచ్చి పరీక్షలు రాసేస్తే డిగ్రీ అయిపోతుంది. ఈ లోపున మీరో రెండు మూడు సార్లు వచ్చి వెళితే బావుంటుంది. తననీ ఎప్పుడు కావాలంటే అప్పుడు పంపిస్తాము తను చెప్పాలే కానీ. ఇంకేమైనా చేయవచ్చా చెప్పండి' అంది అరుంధతి ఆలోచిస్తూ.

ఆవిడ మాటలకీ, మంచితనానికీ భ్రమరాంబ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ' ఏదో చిన్నపిల్ల, తెల్లిసో తెలియకో ఏమైనా తప్పుగా మాట్లాడిందా? ' రాత్రి తనతో కూతురు అన్న మాటలే గుర్తు చేసుకుంటూ. అంది అరుంధతి చేతులు పట్టుకుని.

'అబ్బే, అస్సలు అలాంటిదేమీ లేదు, ఉంటే నేను చెప్పనా, నాకేమీ మొహమాటం లేదు. వరసలతో పుట్టకపోయినా వరసలు కలుపుకున్న బంధువులం మనం, దాపరికమేమీ లేదు, మా కోడలు కూడ మా మాధవి లాగే, కూతురిలాగే ఉండాలని మా కోరిక. ఎక్కడైనా ఆడపిల్లలు సర్దుకోవాలని, అదే అత్తవారి ఇల్లు అయితే మరీ ఒదిగి ఉండాలని మనం చిన్నప్పటినించీ చెప్పే మాటలు ఎంత వరకూ సరి అయినవి చెప్పండి? ఒక్క సారిగా కొత్త ఇల్లూ, కొత్త మనుష్యులూ, అలవాట్లూ కొద్దిగా టైము పట్టదూ అలవాటు అవడానికి... అదే నేను చెప్పవలసింది, ఎంత మంచి పేరు పెట్టారో అంతకు వెయ్యి రెట్లు మంచి పిల్ల మా సుశీల' అంది మనస్ఫూర్తిగా.
' ఏమీ కంగారు లేదు, అన్నగారితో ఆలోచించే చెప్పండి. అంది భ్రమరాంబ భుజం మీద ఆప్యాయంగా చేయి వేస్తూ

'నాకు తెలుసు ఇది పల్లెటూరు, పక్కనెవరుంటారో తెలియని మా బొంబాయిలా కాదు ఇక్కడ, మీరు అన్నయ్యగారు ఆలోచించుకుని సుశీలని ఇక్కడ ఉంచితే కొన్నాళ్ళు మంచిదని అనిపిస్తే సరే, లేకపోతే నాకోడలిని నాతో తీసుకుపోతాను' అంది. రాత్రి రాఘవరావుకి తెలిసింది ఈ విషయం. మామూలుగా అయితే ఆయన ఏమనేవాడో కానీ వియ్యపురాలి ఆలోచన అతనిని

ఆలోచింపచేసింది. 'సరే, ఆవిడ వెళ్ళేలోపున చెబ్దాములే' అన్నాడు, అటు తిరిగి పడుకుంటూ. రాత్రి గోంగూర పచ్చడీ, ముక్కల పులుసూ మళ్ళీ మళ్ళీ వేసుకుని తిన్న కూతురిని చూస్తూ నిద్ర పోయింది భ్రమరాంబ. సుశీల వచ్చి రొండు రోజులయింది.

మూడో రోజు అంది అత్తగారితో, 'అత్తయ్యా ఈరోజు మన ఫాక్టరీ ప్రారంభించిన రోజు కదా, మీ అబ్బాయి చెప్పారు. పూజ అది చెయ్యాలి కదా, మరి ఎలాగా? మనం ఇక్కడే ఉండిపోయాం కదా? ' అని.

'అవును, వాళ్ళిద్దరూ లేరు కదా, వచ్చేవారానికి వాయిదా వేసారు కదా, మర్చిపోయావా, అది అనుకున్నాకే కదా మనం బయలుదేరింది నవ్వుతూ అంది' అరుంధతి. తప్పయినట్టు నాలిక కరుచుకుంది సుశీల.

రోజల్లా సుశీల తోటలోకి వెళ్ళలేదు, సన్నజాజులు మాత్రం మాలలు కట్టి అందరికీ ఇచ్చింది. తనకి మాటి మాటికీ సురేష్ గుర్తు వస్తున్నాడు. ఇంటికి రాగానే 'సుశీ,' అని పెద్దగా అరుచుకుంటూ వస్తాడు, అత్తగారు వాళ్ళూ ఏమైనా అనుకుంటారేమో అని తనకి మొహమాటం, ఇరుకు గదుల్లోనే అతను చేసే అల్లరి, సరదా మాటలు, వచ్చేముందు 'తొందరగా వచ్చేస్తావు కదూ 'అంటూ చూసిన జాలి చూపులూ అన్నీ తలపుకు వచ్చి పరధ్యానంగానే ఉంది రోజంతా. 'అక్కా రావే చింతగింజలు ఆడదాం 'అని చెల్లి పిలిస్తే వెళ్ళలేదు.

మర్నాడు స్నానానికివెళ్ళడానికి పెట్టెలోంచి చీర తీసుకుంటున్న అరుంధతిని అడిగింది 'అత్తయ్యా, మనం తిరిగి వెళ్ళడం ఎప్పుడూ?, మళ్ళీ మీకు స్కూల్ తెరుస్తారు కదా!, మావయ్యగారు వాళ్ళూ కూడ వచ్చేస్తారుకదా 'అంది.

'వెళదాంలే అమ్మా, నువ్వో నాలుగు రోజులుంటావా పోనీ మీ ఇంట్లో 'అని స్నానానికి వెళ్ళిపోయింది.

'అవునే ఎలాగూ వచ్చావు కదా, ఓ నాలుగు రోజులుండి వెళ్ళచ్చుగా, పండగకి మీ ఆయనొస్తే కలిసి వెళ్ళిపోవచ్చు' అంది సుశీల పిన్ని కామేశ్వరి.

'లేదు పిన్నీ, అత్తయ్యకి ఎక్కువ సెలవు లేదు, పరీక్షలు వస్తాయి కదా మళ్ళీ 'అని నసిగింది.

'అదెందుకులే, మా ఆయన మీద బెంగపెట్టుకున్నాను పిన్నీ అను సరిపోతుంది కదా' అంది ఆవిడ నవ్వుతూ.

మధ్యాహ్నం భ్రమరాంబ అడిగింది 'మీ అత్తగారు కూడా ఉండమంటున్నారు ఓ పదిహేను రోజులుండి పండగయ్యాక అబ్బాయితో కలిసి వెళ్ళవచ్చుకదే' అని.

'వద్దులే అమ్మా, మొన్న నేనూ అలాగే అనుకున్నాను, కానీ ఎందుకో ఇంక ఉండ బుద్ధి కావడంలేదు. పైగా అత్తయ్య ఒక్కరూ వెళ్ళాలి కదా, పాపం నాకోసమే వచ్చారు స్కూల్ సెలవు పెట్టి మరీ. ఇంక బెంగ పెట్టుకోనులే ' అంది.

'అవునులే నువ్వెళ్ళకపోతే అల్లుడు బెంగ పెట్టుకుంటాడు మరి ' అంది కామేశ్వరి నవ్వుతూ,

'ఫో పిన్నీ ఎర్రబడ్డ చెక్కిళ్ళతో' నీరెండలో తూరీగలా పరుగుతీసింది పెరట్లోకి.

మర్నాడు అత్తగారి కంటే ముందే లేచి తయారయిపోయి 'అత్తయ్యా మీదే ఆలస్యం, వీరయ్య వచ్చేస్తాడు మళ్ళీ, అని ఆవిడని కంగారు పెడుతున్న సుశీలని ఆశ్చర్యంగా చూసింది భ్రమరాంబ.. 'నాకు అక్కడ బావులేదమ్మా' అని మొన్న గారాలు పోయింది ఈ పిల్లేనా అని. 'మిస్సింగ్ యూ, స్టార్ట్ సూన్ 'అన్న సురేష్ ఇచ్చిన టెలిగ్రాం చేసిన మంత్రం అది అని వాళ్ళకి తెలీదు ఎందుకంటే అది వచ్చే టైముకి వాళ్ళు మధ్యాహ్నపు నిద్రలో ఉన్నారు మరి. నార చీరలు కట్టి కారడవులలో ఉండడానికి కూడ సీతమ్మ సిద్ధపడటానికి కారణం రామయ్య తో కలిసి ఉండగలగడమే కదా. భారతదేశపు ఆడపిల్లలందరిలోనూ ఎంతో కొంత సీతమ్మ అంశ ఉంటుందేమో మరి. కంటికి రెప్పలా చూసుకునే భర్తా, తన కంట్లో నలక పడితే తాము కళ్ళనీళ్ళు పెట్టుకునే అత్తమామలున్న అమ్మాయి కాపురం గురించి ఇక తనకేమీ దిగులే లేదు అనుకుంది భ్రమరాంబ. చీర సారెలతో ఆనందంగా సాగనంపారు సుశీలని. ***